క్లుప్తంగా

అంబేడ్కర్ సర్కిల్‌లో బస్సు షెల్టర్ నిర్మించరూ!

తహసీల్దార్‌కు మాల మహానాడు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మాల మహానాడు నాయకులు

పుంగనూరు: పట్టణంలోని ప్రధాన కూడలిగా ఉన్న అంబేడ్కర్ సర్కిల్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం కోసం బస్ షెల్టర్ నిర్మించాలని కోరుతూ దళిత నాయకుడు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఆర్.అశోక్ బుధవారం తహసీల్దార్ రాముకు వినతిపత్రం అందజేశారు. అశోక్ మాట్లాడుతూ, బెంగళూరు, చిత్తూరు, మదనపల్లె ప్రాంతాలకు సంబంధించిన వెళ్లే ప్రయాణికులకు అంబేడ్కర్ సర్కిల్‌లోని చెట్లే బస్ షెల్టర్‌గా ఉపయోగపడేవని, వాటిని రోడ్డు విస్తరణ పనుల్లో తొలగించడంతో మండుటెండలో అవస్థల నడుమ నిలబడాల్సి వస్తోందని సమస్యను నివేదించారు. దీనిపై తహసీల్దార్ రాము, ఎస్‌ఐ లోకేష్ మాట్లాడుతూ, షెల్టర్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దళిత నాయకులు నరసింహులు, నాగరాజ, వెంకట్రమణ, సీపీఎం నాయకులు రమణారెడ్డి, రాజు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

పుంగనూరు: వేసవి సెలవుల్లో పిల్లలకు గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరం జూన్ 6వ తేదీవరకు నిర్వహించనున్నామని గ్రంథాలయాధికారి తులసినాయక్ బుధవారం తెలిపారు. విద్యార్థుల మేధస్సుకు పదునుపెట్టే కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా పాలిసెట్



పాలిటెక్నిక్ కళాశాల వద్ద పాలిసెట్ రాసేందుకు వెళుతున్న విద్యార్థులు

పలమనేరు: పట్టణంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన పాలిసెట్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 1629 మంది విద్యార్థులకుగాను 1318 మంది హాజరైనట్టు పాలిసెట్ కో–ఆర్డినేటర్ మహమూద్ తెలిపారు. ఇక్కడి సెంటర్లలో ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలను జిల్లా పరిశీలకులు, స్థానిక ఆర్డీఓ భవాని పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పాలిసెట్ ఫలితాలు మరో పదిరోజుల్లో వెలువడనున్నట్టు కో–ఆర్డినేటర్ తెలిపారు.

సీహెచ్‌ఓ సేవలు మరువలేనివి



సీహెచ్‌ఓ దంపతులను సత్కరిస్తున్న ఆరోగ్య సిబ్బంది

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లె పీహెచ్‌సీలో సీహెచ్‌ఓగా అనూరాధ అందించిన సేవలు మరువరానివని పలువురు కొనియాడారు. బుధవారం అనూరాధ ఉద్యోగ విరమణ పురస్కరించుకుని స్థానిక రాయల్‌మహల్‌లో అనూరాధ దంపతులను సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఆమె సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు విజయ్‌చంద్ర, అరుణ్‌కుమార్, శాలిని, పద్మావతి, చందనప్రియ, సాయికుమార్, చంద్రశేఖర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా ప్రసన్న కుమార్



బైరెడ్డిపల్లి: తహసీల్దార్‌గా ప్రసన్నకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ మాధవరాజు గంగవరానికి బదిలీ కావడంతో శాంతిపురం నుంచి ప్రసన్న కుమార్‌ను బదిలీపై ఇక్కడికి వచ్చారు.

నిత్యాన్నదానానికి రూ:2.04 లక్షల విరాళం



బోయకొండలో నిత్యాన్నదాన పథకానికి విరాళమిస్తున్న భక్తులు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి భక్తులు రూ.2.04 లక్షలు విరాళమిచ్చినట్లు ఈఓ ఏకాంబరం బుధవారం తెలిపారు. మదనపల్లెకు చెందిన టి. మురళీనాయుడు, గిరి దంపతులు రూ.1,34,675, ఆర్.వెంకటశివారెడ్డి, పంచరత్నమ్మ రూ.50 వేలు, బెంగళూరుకు చెందిన గంగప్ప రూ.20 వేల చొప్పున విరాళమిచ్చినట్లు ఈఓ తెలియజేశారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఏఎంసీ చైర్మన్ గిరిపై రెండు కులాల పట్టు..!

- ఇక్కడి ఏఎంసీ బీసీ మహిళలకు రిజర్వేషన్ ఖరారు
- చైర్మన్ ఎంపికలో ప్రజాభిప్రాయ సేకరణ దిశగా అధిష్టానం
- ఇప్పటికీ తెగని టెన్షన్



పలమనేరు ఏఎంసీ కార్యాలయం

పలమనేరు: నియోజకవర్గంలో ఎమ్మెల్యే తర్వాత ప్రొటోకాల్ ఉన్న పోస్టు మార్కెట్ కమిటీ చైర్మన్. ఏఎంసీ చైర్మన్‌కు అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ వ్యవహారాల్లో సముచిత స్థానం ఉంటుంది. దీంతో కూటమి అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలోని పలు మండలాల నాయకుల కన్ను చైర్మన్ కుర్చీపై పడింది. జిల్లాలోని పది మార్కెట్ కమిటీలకు ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయగా, పలమనేరు ఏఎంసీని బీసీ మహిళలకి కేటాయించారు. ఇప్పటికే జిల్లాలోని కొన్ని ఏఎంసీలకు కొత్త చైర్మన్లను కూటమి ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. ఈ జాబితాలో పలమనేరు కనిపించలేదు. ప్రధానందా కూటమి నేతల్లో ఎక్కువగా డిమాండ్ ఉండడంతో స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఎవరి పేరును సిఫారసు చేయకుండా ఐవీఆర్‌ఎస్(ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్)కు రెఫర్ చేయడం తెలిసిందే. ఇందులో నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్న కురబల్లో గంగవరం మాజీ జెడ్పీటీసీ సోమశేఖర్ గౌడ సతీమణి, ఇదే మండలానికి చెందిన వాల్మీకి కులానికి చెందిన రాజన్న సతీమణుల పేర్లు ఇప్పుడు తెరపైకొచ్చాయి.

ఈ రెండు కులాల్లో ఎవరికో..?

పలమనేరు నియోజకవర్గంలో ఎక్కువగా బీసీ ఓటర్లు ఉండడంతో ముందు నిర్ణయించినట్టే రిజర్వేషన్లలో మార్పు లేకుండా పోయింది. ఇక్కడ టీడీపీని అంటిపెట్టుకున్న బీసీ కులాల్లో 22వేల దాకా కురబ కులానికి చెందిన ఓటర్లు, వాల్మీకి కులానికి చెందిన ఓటర్లు 16వేల దాకా ఉన్నారు. వీరిలో కురబలు ఎన్నో ఏళ్లుగా టీడీపీకి వెన్నంటే ఉన్నారు. వాల్మీకులు వీరికి మద్దతుగానే ఉంటున్నారు. అయితే వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన రాజన్న ఇదే ఏఎంసీ చెక్‌పోస్టులో కూలీగా పనిచేసి ఇప్పుడు పార్టీలో క్రియాశీలకంగా మారాడు. కురబ కులానికి చెందిన సోమశేఖర్‌గౌడ బాగా చదువుకున్న వ్యక్తి కావడంతో వీరిలో ఎవరిని ఎంపిక చేయాలో స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డికి సైతం పాలుపోలేదని తెలిసింది. దీంతో ఐవీఆర్‌ఎస్ ద్వారా అధిష్టానం నిర్వహించిన సర్వేలో సోమశేఖర్ గౌడుకే మద్దతు లభించిందని తెలుస్తోంది. ఏదేమైనా జిల్లాలో అన్ని మార్కెట్ కమిటీలకు దాదాపుగా చైర్మన్ ఎంపికలు జరిగినా పలమనేరు, కుప్పం మాత్రం ఇప్పటికీ పెండింగ్‌లో ఉండడం ఆ పార్టీలోనే కలవరపెడుతోంది. మరోవైపు ఇది చర్చనీయాంశమవుతోంది.

నోటీస్ బోర్డు

- ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం: ఐటీఐలో ఒకటి, రెండేళ్ల కాలవ్యవధి కలిగిన ట్రేడ్(కోర్సు)లలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జి. నగేష్ తెలిపారు. ఏడాది కాలవ్యవధి కలిగిన ట్రేడ్లలో డీజిల్ మెకానిక్, వెల్డర్, రెండేళ్ల ట్రేడ్లలో డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్ కోర్సులు ఉన్నట్టు చెప్పారు. టెన్త్ పాస్ లేదా ఫెయిల్ అయిన విద్యార్థులు మే 24 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని మే 26 లోపు సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోవాలని, ఆ తర్వాత జూన్ 2 నుంచి 10వ తేదీ వరకూ జరిగే కౌన్సెలింగ్‌లో పాల్గొని సీట్లు పొందాలన్నారు.అన్ని ట్రేడ్లలో బాలికలకు రిజర్వేషన్ ఉందన్నారు.

విశేష పూజలందుకున్న మలాలమ్మ



మలాలమ్మను దర్శించుకుంటున్న పెద్దిరెడ్డి



నడింపల్లె చౌడేశ్వరీదేవి ఉత్సవాలకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆహ్వానిస్తున్న నాయకులు

గంగవరం: అక్షయ తృతీయ పురస్కరించుకుని మండలంలోని మేలుమాయి క్రాస్ వద్ద ఉన్న మలాలమ్మ(చాముండేశ్వరీ దేవి) ఆలయంలో అమ్మవారికి బుధవారం పూజా కైంకర్యాలు విశేషంగా నిర్వహించారు. తిరుపతి నుంచి పుంగనూరు పర్యటనకు వెళ్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతి ఆహ్వానం మేరకు మలాలమ్మను దర్శించుకున్నారు. అంతకు ముందు గంగవరం ఫ్లై ఓవర్ వద్ద ఆయనను నియోజకవర్గ పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మొగసాల క్రిష్ణమూర్తి, భాస్కర్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, ప్రహ్లాద, చెంగారెడ్డి, చంద్రప్ప, భాగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శుభ కార్యాలకు హాజరైన ఎమ్మెల్యే, ఎంపీ

రొంపిచెర్ల: మండలంలో వివిధ శుభకార్యాలకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి హాజరయ్యారు. బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ ఆర్‌సీపురం కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రమణయ్య నూతన గృహ ప్రవేశానికి పెద్దిరెడ్డి హాజరయ్యారు. అలాగే నడింపల్లెలో ఈ నెల 9 నుంచి 11వరకు జరిగే చౌడేశ్వరీదేవి ఉత్సవాల హాజరు కావాలని ఆయనను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆహ్వానించారు. అలాగే కమ్మోళ్లపల్లెకు చెందిన నరసింహారెడ్డి కుమారుడు దిలీప్‌రెడ్డి వివాహానికి రాజంపేట ఎంపీ హాజరై వరుని ఆశీర్వదించారు. ఎంపీపీ చిచ్చిల పురుషోత్తంరెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, మండల కన్వీనర్ కరీముల్లా పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎంపీని కలిసిన నాయకులు



ఎంపీ మిథున్‌రెడ్డితో నాయకులు

సదుం: మండలానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని తిరుపతిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలానికి సంబంధించిన పలు విషయాలపై వారితో చర్చించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, మాజీ సర్పంచ్ సయ్యద్ బాషా, బాబురెడ్డి, సైపుల్లా, శ్రీనివాసులు, రమణారెడ్డి, శివ, దాము, మనోజ్, కాలేశా, రమేష్, ఆనందరెడ్డి, బావాజి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో అమ్మవారి గంగచాటు

- వైభవంగా గెరిగ ప్రతిష్ఠ
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- మారెమ్మ, గంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు



మారెమ్మ ఆలయం వద్ద చేస్తున్న ప్రత్యేక పూజలు

పలమనేరు: పట్టణంలో తిరుపతి గంగమ్మ జాతర సంబరాలు ఘనంగా మొదలయ్యాయి. బుధవారం అమ్మవారి గెరిగ ప్రతిష్ఠ వేడుకగా నిర్వహించారు.అర్ధరాత్రి నుంచి మొదలైన గంగచాటు గురువారం ఉదయం వరకు ముగియనుంది. మారెమ్మ ఆలయంలో వద్ద అమ్మవారి విగ్రహాన్ని పవిత్ర జలాలతో అభిషేకించి, జలాన్ని గంగమ్మ ఆలయానికి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ తీసుకొచ్చారు. అనంతరం గంగమ్మ, మారెమ్మ ఆలయాలవద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ శ్రీధర్, కమిటీ సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు. జాతర పురస్కరించుకుని మే 17వ తేదీ వరకు గంగమ్మ ఆలయం వద్ద నిత్యం ప్రత్యేక పూజలు, మారెమ్మ ఆలయం వద్ద పొంగళ్లు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా పత్తికొండ పెద్దపులి గంగమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, పార్టీ నాయకులు

గంగవరం: మండలంలోని పత్తికొండలో పెద్దపులి గంగమ్మ జాతరను గ్రామస్తులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందు రోజు మంగళవారం రాత్రి అమ్మవారి శిరస్సును గ్రామ వీధుల్లో మెరవణి చేసి ప్రతిష్ఠించి, జాతర సంబరాలకు శ్రీకారం చుట్టారు. పలమనేరు నియోజకవర్గ పరిసరాలే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి సైతం భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. జిల్లాలో పుంగనూరులో జాతర ముగిసిన తరువాత పత్తికొండ, ఆ తరువాత పలమనేరులో నిర్వహించడం ఆనవాయితీ. గురువారం వేకువ జామున జలధితో జాతర సంబరాలు ముగుస్తాయి. జాతరలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, సర్పంచ్ రవినాయుడు, పట్టణ కన్వీనర్ హేమంత్‌రెడ్డి, నాయకులు చంద్రప్ప, చెంగారెడ్డి, సిద్ధప్ప, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మంజూరైనా బ్యాంకులోనే మగ్గుతున్న రుణం..!

- బ్యాంకు ముందు డ్వాక్రా మహిళల ఆందోళన



రొంపిచెర్ల: ఐకేపీ అధికారుల నిర్లక్ష్యంతో సభ్యులు బ్యాంకర్లు మంజూరు చేసిన రుణం బ్యాంక్ ఖాతాలోనే మగ్గుతున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం.. గానుగచింత గ్రామ పంచాయతీ మారంరెడ్డిగారిపల్లెకు చెందిన శివజ్యోతి స్వయం సహాయక సభ్యులకు రొంపిచెర్ల సప్తగిరి గ్రామీణ బ్యాంకులో మార్చి 26న రూ.15 లక్షల రుణం మంజూరైంది. ఈ రుణాన్ని ఒక్కో సభ్యురాలికి రూ.1.50 లక్షల వంతున వారి ఖాతాలో సీసీ జమ చేయాల్సి ఉంది. సీసీలు గ్రామ సంఘం లీడర్లు మార్పు చేస్తేనే బ్యాంకు ఖాతా నుంచి రుణం డ్రా చేసేందుకు అనుమతి ఇస్తామనడంతో సభ్యులు ఎంపీడీవో, ఏపీఎం, బ్యాంకర్లకు మొర పెట్టుకున్నా ఫలితం శూన్యం. అలాగే, సీసీలు, ఏపీఎంను ప్రశ్నించినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో బ్యాంకు ఖాతా నుంచి రూ.18 వేలను నెల క్రితం సభ్యులకు, లీడర్లకు తెలియకుండానే ఐకేపీలో పని చేస్తున్న కొందరు ఫోర్జరీ సంతకాలతో డ్రా చేశారు! ఇది వెలుగులోకి రావడంతో గ్రామ లీడర్లు, సభ్యులు ఐకేపీ అధికారులను నిలదీశారు. దీంతో ఐకేపీ సిబ్బంది మళ్లీ రూ.18 వేల నిధులను బ్యాంకు ఖాతాలో జమ చేశారు. దీంతో సభ్యులు తమ రుణం తమకు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సప్తగిరి గ్రామీణ బ్యాంకు ముందు ఆందోళన చేశారు. దీనిపై పీడీ శ్రీదేవి వివరణ కోరగా..రెండ్రోజుల్లో వారి ఖాతాల్లోకి రుణం సొమ్మును బదిలీ చేస్తామని చెప్పారు.

ఘనంగా బసవేశ్వర జయంతి





మహాత్మా బసవేశ్వరస్వామి, హాజరైన వీరశైవ లింగాయత్ జంగమ సేవా సంఘం సభ్యులు

పెద్దపంజాణి: మండలంలో ముత్తుకూరులోని బసవేశ్వర ఆలయంలో మహాత్మా బసవేశ్వర జయంతిని బుధవారం వీరశైవ లింగాయత్ జంగమ సేవా సంఘం ఘనంగా నిర్వహించింది. తొలుత బసవ చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. బసవ సేవలను ప్రస్తుతించారు. ఆయన అడుగు జాడల్లో పయనించాలని వక్తలు పిలుపునిచ్చారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ జంగమ సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు నాగరాజ్ గౌడ్, మాజీ ఏపీపీ మనోహర్, పుంగనూరు సంఘం అధ్యక్షులు నాగరాజు, పెద్దపంజాణి అధ్యక్షులు మల్లేశయ్య, ప్రధాన కార్యదర్శి సొన్నేపల్లి ప్రవీణ్, సంఘం నాయకులుపాల్గొన్నారు.

తెలుగు కవిత్వాన్ని మలుపు తిప్పిన మహాకవి శ్రీశ్రీ



శ్రీశ్రీ జయంతి నిర్వహిస్తున్న తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకులు

పలమనేరు: ఆకాశపు దారులంట హడావిడిగే వెళ్లిపోయే కవితా జగన్నాథ రథాన్ని భూమార్గం వైపు పట్టించిన మహాన కవి శ్రీశ్రీ అని స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు కీర్తించారు. పట్టణ సమీపంలోని కళామందిరంలో బుధవారం శ్రీశ్రీ జయంతిని ఘనంగా నిర్వహించారు. శ్రీశ్రీ రచనలు, ఆయన కవితా శైలి ప్రత్యేకత గురించి తులసీనాథం నాయుడు మాట్లాడారు. అనంతరం శ్రీశ్రీ రాసిన పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమితి నిర్వాహకులు, తెలుగు భాషాభిమానులు, సాహితీప్రియులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

సదుం: గిరిజనుల కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీ గిరిజన సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు హరిశివప్ప కోరారు. మండలంలోని భట్టువారిపల్లెలో సంఘం ఆధ్వర్యంలో బుధవారం గిరిజనులతో సమావేశం నిర్వహించారు. గిరిజన సంఘం నాయకులు రమణప్ప మాట్లాడుతూ..గిరిజనులు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో రాణించాలన్నారు. తమ పిల్లలను కస్తూర్బా, గురుకుల, నవోదయ విద్యాలయాల్లో చదివించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని, డ్వాక్రా, గిరిజన కార్పొరేషన్ల రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. జిల్లా జనరల్ సెక్రటరీ ఉమామహేశ్వరరావు, రవి, వెంకట్రావ్, మేఘన, కల్యాణి, శంకర, భానుప్రకాష్ పాల్గొన్నారు.

శుభ కార్యాల్లో జెడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే

వి.కోట : జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ బుధవారం మండలంలోని పలు శుభాకార్యాలకు నాయకులతో కలిసి వేర్వేరుగా హాజరయ్యారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

పులిచెర్ల(కల్లూరు): అక్షయ తృతీయ పురస్కరించుకుని పులిచెర్ల మండలం దేవళంపేటలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి చందనోత్సవం, ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు.

మహిళా సాధికారతే లక్ష్యం

- కడా పీడీ వికాస్ మర్మత్



మహిళలకు ప్రాంక్టియర్ మార్కెట్స్ సంస్థ ప్రతినిధులు అందజేసిన బుక్‌లెట్లు

కుప్పం: గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సాధికారత సాధించడమే లక్ష్యంగా కడా, ప్రాంక్టియర్ మార్కెట్స్ సంయుక్తంగా వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ అన్నారు. బుధవారం మండల సచివాలయంలో ప్రాంక్టియర్ మార్కెట్స్ సంస్థ, కడా సంయుక్తంగా ఒప్పందం కుదుర్చుకున్నాయి. షిలీఫ్ భారత్ స్వరూప్ ద్వారా 25 గ్రామాల్లో 100 మంది గ్రామీణ మహిళా వ్యవస్థాపకులకు సాధికారతను కల్పించడానికి ఉమ్మడి నిబంధనలతో కార్యక్రమానికి పూనుకుంటున్నట్లు చెప్పారు. మహిళా వ్యవసాయ సామర్థ్యం, వాణిజ్యాన్ని ప్రభావితం చేసే సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామని, వీటి వల్ల ప్రతి స్త్రీకి స్థిరమైన జీవనోపాధి కల్పించడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, ప్రాంక్టియర్ మార్కెట్స్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మారని ‘సమాచారం’

- అధికారులు మారినా మారని బోర్డులు
- పౌర సమాచారం కోసం తంటాలు పడుతున్న అర్జీలుదారులు



తహసీల్దార్ కార్యాలయంలో తప్పులున్న సమాచార బోర్డు



ప్రభుత్వాసుపత్రిలో తప్పులతో కూడిన సమాచార బోర్డు

చౌడేపల్లె: అధికారులు బదిలీ అయినా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలు పౌర సమాచార కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఏర్పాటు చేసిన సమాచార బోర్డుల్లో మాత్రం వారి పేర్లు మాత్రం మార్చలేదు. డిప్యూటీ తహసీల్దార్, ఆర్‌డీఓ మారినప్పటికీ తహసీల్దార్ కార్యాలయంలోని బోర్డులో ఇప్పటికీ పాత పేర్లే దర్శనమిస్తున్నాయి. డీఎంఅండ్‌హెచ్‌ఓ, ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్, సీనియర్ సహాయకులు మారినప్పటికీ బోర్డుల్లో కొత్తవారిపేర్లు లేకపోవడం గమనార్హం! ఫలితంగా అవసరమైన సమాచారం కోసం ఎవరికి దరఖాస్తు చేయాలో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు సమాచార బోర్డులో వివరాలు పక్కాగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వలస వచ్చిన మూగజీవాలు

వర్షాభావ ప్రాంతాల్లో మేతకరువు

తిరిగి వర్షాలు పడేంతవరకు ఇక్కడే..



కల్లూరు సమీపంలో మేత కోసం వలస వచ్చిన గొర్రెలు

పులిచెర్ల(కల్లూరు): మూగ జీవాలైన పశువులు ,మేకలు, గొర్రెలకు వేసవిలో మేత సమస్య పీడిస్తోంది. ముఖ్యంగా సన్న జీవాలైన గొర్రెలు, మేకలకు కసువు అందుబాటులో ఉండాలి. లేని పక్షంలో మేత లభించే ప్రాంతాలకు కాపరులు వాటిని తీసుకెళ్లవలసిందే. వర్షాలు కురిసిస్తే అవి ఉన్న ప్రాంతంలోనే పచ్చగడ్డి లభిస్తుంది. వర్షాభావ పరిస్థితుల్లో అయితే వలస పోకతప్పదు. ప్రస్తుతం వేసవి కాలంలో కొన్ని ప్రాంతాల్లో గడ్డికి, తాగు నీటికి ఇబ్బందులు తలెత్తడంతో ఇతర ప్రాంతాల నుంచి గొర్రెలు, మేకల పెంపకందారులు వలసబాట పట్టారు. దాదాపు 15రోజుల క్రితం పులిచెర్ల మండలంలో మంచి వర్షాలు పడడంతో అన్నమయ్య జిల్లాలోని గర్నిమిట్ట ,కలకడ, గ్యారంపల్లె, పీలేరు పరిసర ప్రాంతాల నుంచి గొర్రెలను మేపు కోసం ఈ ప్రాంతాలకు తీసుకువస్తున్నారు. ఇక్కడ వర్షాలు పడడంతో గడ్డి చిగురించి మేతకు ఇబ్బంది లేకుండా ఉండడంతో గొర్రెల మందలు పలుచోట్ల కనిపిస్తున్నాయి.